ఆంధ్రజ్యోతి

రక్త హీనత నివారణకే పోషణమాసం 8లో..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి 8లో..

పశు బీమా అమలు ఏదీ..?



- ఆరేళ్లుగా నిలిచిన పథకం
- పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం
- పథకాన్ని పునరుద్ధరించాలని పశుపోషకుల వినతి

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పశు బీమా పథకం అమలు కాకపోవడంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జి ల్లాలో వ్యవసాయం త రువాత రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమపైనే ఆ ధారపడి జీవిస్తున్నారు. పాడి పశువుల కొనుగోలుకు కొన్ని సార్లు రూ. లక్ష రూపాయలు కూడా వెచ్చిస్తుంటారు. పాల దిగుబడిని బట్టి పశువు ధర ఉంటుంది. పశువులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ దాని ఆసరాగా చే సుకొని జీవిస్తుంటారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించే వ్యవసా య అనుబంధ రంగాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. రైతులు వ్య వసాయంతో పాటు పాడి పరిశ్రమలను కొనసాగిస్తే ఆర్థికంగా ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం రైతులకు చేయూతనందిస్తామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ఆరేళ్లుగా పశు బీమా నిలిపివేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పాడి పశువు లకు రైతు వాటా ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం కొంత నగదును కలిపి బీమా సౌకర్యం కల్పించేది. దీంతో పశువులు మృత్యువాత పడినా వచ్చిన బీమా డబ్బులతో రైతులు మళ్లీ పశువులను కొనుగోలు చేసుకొని భరోసా గా ఉండేవారు. పథకం నిలిచి పోవడంతో రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు.

ఆరేళ్లుగా అమలు కాని పథకం...

పాడి పశువుల బీమా పథకం 2017-18 వరకు ప్రభుత్వం అమలు చే సింది. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరేళ్లుగా ఈ పథకం గురించి పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో రైతులు ఆర్థికంగా ఎది గేందుకు పాడి పరిశ్రమ ఎంత గానో దోహదపడుతుంది. పశువులు రోడ్డు, విద్యుత్ ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా మృత్యువాత పడుతున్నాయి. మేలు జాతి పాడి పశువులకు లక్షల్లో డిమాండ్ ఉంది. అనివార్య కారణాలతో పశువులు మృతి చెందితే రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయి అప్పుల్లో కూరుకు పోతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు, పిడుగు పాటు గురై పలు పశువులు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం బీమా పథకాన్ని పునరుద్దరించి ఆదుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

1.24 లక్షల గేదెలు, 47,405 ఆవులు..

జిల్లా వ్యాప్తంగా గేదెలు 1,24,248 ఉండగా, 47,405 ఆవులు, 6,10,985 గొర్రెలు, 97,033 మేకలు, 14,895 పందులు, కుక్కలు 3,310, పౌల్ట్రీ 8,27, 595 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్ర మపై ఆధారపడి జీవిస్తున్నారు. పాల వ్యాపారంతో కుటుంబ పోషణ సాగిస్తున్నారు.

ప్రభుత్వం అందించిన పశువులకే బీమా..

గత రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా లబ్దిదారులకు అందించిన పశువులకు మాత్రమే బీమా సౌకర్యం కల్పించింది. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూనిట్ ధరలోనే పశువులకు బీమా ప్రీమియం చెల్లిస్తున్నారు. దీంతో ప్రభుత్వం పంపిణీ చేసిన పశువులకు బీమా సౌకర్యం ఉండి రైతులు కొనుగోలు చేసుకున్న పశువులకు మాత్రం బీమా సౌకర్యం కల్పించకపోవడం సరికాదని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు బీమా కంపెనీలను ఆశ్రయించి పశువులకు బీమా చేయించాలంటే సుమారు లక్ష రూపాయలు ఉన్న పశువుకు రూ. 7 నుంచి రూ. 8వేల ఖర్చు అవుతున్న పరిస్థితి నెలకొనడంతో పాడి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గేదెలు మరణిస్తే నష్టపోతున్నాం



ప్రభుత్వం బీమా పథకాన్ని ఎత్తివేయడంతో పశువులు మృత్యువాత పడినప్పుడు ఆర్థికంగా నష్టపోతున్నాం. గతంలో బీమా సౌకర్యం ఉన్న ప్పుడు పశువులు మృత్యువాత పడితే బీమా డబ్బులతో తిరిగి పశువులను కొనుగోలు చేసుకునేది. పథకం ఎత్తివేసిన నుంచి ఆర్థికంగా నష్టం వాటిల్లుతోంది.

- ఒడ్డెం శ్రీనివాస్, పాడి రైతు, గోదూరు

పథకాన్ని అమలు చేయాలి..



పశువుల బీమాకు ప్రైవేటు బీమా కంపెనీలను ఆశ్రయిస్తే డబ్బులు అధికంగా ఖర్చు అవుతున్నాయి. దీంతో రైతులు పశువులకు బీమా చే యించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం పథకాన్ని తిరిగి పున రుద్ధరించాలి. రైతు వాటాధనం కలుపుకొని ప్రభుత్వం ప్రీమియం చెల్లించాలి.

- ఎగుర్ల మహేశ్, పాడి రైతు, జగిత్యాల

ప్రభుత్వ నిర్ణయం మేరకే...



ప్రభుత్వ నిర్ణయం మేరకే పశు బీమా పథకం అమలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పంపిణీ చేసిన పథకాలలో లబ్దిదారులు పొందిన పశువులకు మాత్రమే యూనిట్ విలువ నుంచి బీమా కల్పించారు. రైతుల వద్ద ఉన్న పశువులకు ప్రభుత్వం ఎలాంటి బీమా అవకాశాన్ని కల్పించడం లేదు. గతంలో రైతు వాటాధనంతో పాటు ప్రభుత్వం కొంత మొత్తం చెల్లించి పశువులకు బీమా సౌకర్యం కల్పించేది.

- మనోహర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

ఆరోగ్యవంతమైన సమాజం కోసమే పోషణమాసం

బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 20: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసమే పోషణమాసాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. పట్టణంలోని స్థానిక పురాణిపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన చైర్‌పర్సన్ జ్యోతి మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలు, మహిళల ఆరోగ్య రక్షణకై పోషణమాసం నిర్వహించడం అభినందనీయం అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషక ఆహారాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం కిషోర బాలికలచే మానవహారం నిర్మించగా, చైర్‌పర్సన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, అంగన్వాడీ టీచర్లు దయావతి, యతీశ్వరీ, నీలవేణి, రజిని, భాగ్యలక్ష్మీ, శివప్రి య, ఏఎన్ఎం శిరీష, కళావతి, ఆశా కార్యకర్త లావణ్య పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన..పొంగిపొర్లిన డ్రైనేజీలు

ఇబ్బందులు పడ్డ వాహనదారులు, ప్రజలు



వర్షానికే జలమయమైన జగిత్యాల రహదారులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 20: చినుకు పడితే చిత్తడే అన్న చందాన తయారైంది జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రధానరోడ్లు, లోతట్టు ప్రాంతాలు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం అరగంట సేపు కురిసిన వర్షానికి పట్టణంలోని ప్రధాన ప్రాంతాల డ్రైనేజీలు పొంగి పొర్లాయి. దీంతో డ్రైన్‌లో ఉన్న మురికి నీరుతో పాటు, వరదనీరు కలిసి రోడ్లపై ప్రవహించడంతో అటు వాహనాదరులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీలు ఆధునీకరించడంతో పాటు, రోడ్ల నిర్మాణం, యావర్ రోడ్ విస్తరణ త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని కోరుతున్నారు.

వైభవంగా దేవీ వైభవం ప్రవచనం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 : జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం దేవీ వైభవ ప్రవచనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితుడు విషు శర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం భక్తులు లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు.

ఆలయ అధ్యక్షుడు సతీష్ కుమార్, నిర్వాహకులు మార కైలాసం, తవుటు రామచంద్రం తదితరులు ఉన్నారు.

లక్ష్యం మేరకు 'మహిళా శక్తి' అమలు చేయాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యం మేరకు 'మహిళా శక్తి' కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా శక్తి కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల బృందాలకు సాధికా రిత కల్పించడానికి, జీవనోపాధి అంశాలలో బలోపేతం చేయడానికి మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. రానున్న అయిదేళ్లలో మైక్రో ఎంటర్ ప్రైజెస్ డెవలప్‌మెంట్ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు సాధికారిత కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామ జడ్పీ హైస్కూల్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ముత్యంపేట గంగాధర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ డిగ్రీ పొందగా శుక్రవారం కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. కరీంనగర్ జిల్లా కథలు-భాషా పరిశీలన అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించింది.

ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

కథలాపూర్, సెప్టెంబరు 20 : ప్రజల నుంచి స్వీకరించే అన్ని రకాల పిర్యాదులను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు నిలిచి ఉన్న మురికి నీటిని చూసి ఎందుకు ఇక్కడ నిల్వ ఉన్నాయని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నించారు. నిల్వ ఉన్న మురికి నీటిని కాలువ తవ్వి శుభ్రంగా ఉండేలా చేస్తామని అధి కారులు కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి ఫార్మాసిస్టులను మందుల నిల్వ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న బెడ్స్, రోగులకు అందుతున్న చికిత్సల వివరాలను తెలుసుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉంచకూడదని ఇసుక కోసం రీచ్‌లు గుర్తించాలని ఆర్‌డీవో, మైనింగ్ అధికారులను ఆదేశించారు. ధరణి, ప్రజావాణికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తులపై వెనువెంటనేవిచారణ చేపట్టాలన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి ప్రజాపాలన, మహాలక్ష్మీ పథకాల దరఖాస్తుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఓటర్ లిస్టులపై వచ్చే అభ్యంతరాలను ఈ నెల 21లోపు నమోదు చేసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో సంయోద్దీన్, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, వైద్యాధికారిణి సింధూజ, సూపర్‌వైజర్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి సాయినాథ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట రెడ్డి

కోరుట్ల, సెప్టెంబరు 20 : రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్య పుస్తకాలలో పొందు పరచాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పూర్వపరాల సదస్సులో చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి అరుణ పతాకాన్ని ఎగురవేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వెంకటరెడ్డి మాట్లాడారు. తెలంగాణ రైతాంగం సాయుధ పోరాటం దున్నే వాడికే భూమి అన్న నినాదంతో తెలంగాణ ప్రజలు సంవత్సర కాలం నిజాం నవాబుతో పోరాటం చేసారని, దానిని బీజేపీ హిందులకు నిజాం నవాభుకు జరిగిన పోరాటంగా అభివర్ణిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యపుస్తకాలలో పొందు పరిచి పిల్లలతో పాటు ప్రజలకు తెలిసే విధంగా రాష్ట్ర ప్రభుత్వ చర్యతీసుకోవాలని లేదంటే రాష్ట్ర ప్రభుత్వం కూడ బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారానికి మద్దతు పలుకుతుందని అనుకోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం తిప్పి కొట్టడానికి సాయుధ పోరాటంపై అధికారికంగా కార్యక్రమాలను నిర్వహిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు చెన్న విశ్వనాథం, పేట బాస్కర్, తిరుపతి నాయక్, ఎన్నం రాధ, సుతారి రాములుతో పాటు కార్మిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాడ వెంకట రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డిని సన్మానించిన ఎన్‌ఆర్‌ఐ సెల్

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక జీవోను ఇటీవల విడుదల చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డిని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ గల్ఫ్ జేఏసీ బృందం కలిసి ఘనంగా సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లతో కలిసి కృతజ్ఞతలు తెలిపి పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ప్రత్యేక జీవో జారీ కావడానికి సహకరించిన మంత్రి వర్గం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ నాయకులు మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్‌రావు, తోట ధర్మేందర్, గల్ఫ్ జేఏసీ నాయకులు గుగ్గిల్ల రవి గౌడ్, మచ్చ మల్లికార్జున్, దువాస రామకృష్ణ, శేర్ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం చూపిన చొరవకు కృతజ్ఞతగా టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా ఆధ్వర్యంలో స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద నాయకులు సీఎం, మంత్రులు, ఎమ్మెల్సీ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేశారు. చాంద్‌పాషా మాట్లాడుతూ గల్ఫ్‌లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5ల క్షలు పరిహారం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు చేయడం అభినందనీయం అన్నారు. గత ప్రభుత్వానికే గల్ఫ్ కార్మికుల సమస్యలపై నివేదికలు రూపొందించి అందించినా పట్టించుకో లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సమస్యలను గుర్తిం చిందన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలు ప్రభుత్వాలకు వినిపించి, విన్నవించడంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాత్ర అనిర్వచనీయం అన్నారు.

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా మనోహర్



నూతనంగా బాధ్యతలు చేపట్టిన మనోహర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా మనోహర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో గల పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో మనోహర్ బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో జనగామ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా పనిచేస్తున్న మనోహర్‌ను జగిత్యాలకు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పెద్దపల్లి పశు సంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్ నూతన అధికారి మనోహర్‌కు బాధ్యతలు అప్పగించారు. మనోహర్‌ను పలువురు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు సిబ్బంది శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ సంక్షేమ అధికారిగా బోనగిరి నరేశ్, పశు సంవర్ధక శాఖ జిల్లా కార్యాలయానికి చెందిన పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌమార విద్య, హెచ్‌ఐవీపై అవగాహన

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 19: జిల్లా కేంద్రంలోని డీసీఐబీ కార్యాలయంలో శుక్రవారం ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌమార దశ, హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి, పోస్టర్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని 84 ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాలలను ఎంపిక చేసి, విద్యార్థులకు హెచ్‌ఐవీపై పోస్టర్ మేళా పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు, బహుమతులు అందజేశారు. డీఈవో డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ రాజేష్, హెల్త్ డిపార్ట్ మెంట్ నుంచి భూమేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్‌వోబీ నిర్మాణాల్లో వేగం పెంచేలా చర్యలు చేపట్టండి

రైల్వే మంత్రికి ఎంపీ అర్వింద్ వినతి

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నడుస్తున్న ఆర్‌వోబీ నిర్మాణాలను వేగవంతం చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. శుక్రవారం న్యూఢిల్లీ లోని కేంద్ర మంత్రి కార్యాలయంలో బేటి అయి పలు అంశాలను వివరించారు. రైల్వేలకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను మంత్రి అశ్విని వైష్ణవికి వివరించారు. వారానికి ఒకసారి నడిచే కాజీపేట్-దాదర్ రైలుని అంత్యంత త్వరగా నడిపి, వారానికి మూడు సార్లు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అతి కొద్ది రోజుల్లోనే సం బంధిత రైలును వారానికి మూడు సార్లు నడిచేలా ప్రయత్నాలు చేస్తానని మంత్రి హామీనిచ్చారు. అదేవిధంగా అవసరమైన చోట్ల కొత్త ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాల ని, ఢిల్లీకి నిజామాబాద్ మీదుగా రైలు సర్వీస్ నడపాలని, నిజా మాబాద్ పార్లమెంట్ పరిధి మీదుగా తిరుపతి, ముంబైలకు కొత్త రైళ్లను నడపాలని కోరారు. గత రాష్ట్ర ప్రభుత్వాల జాప్యం కారణంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్మూర్-ఆదిలాబాద్, బోదన్-బీదర్ రైల్వే లైన్‌లను మంజూరు చర్యలను వేగవంతం చేయాలని కోరారు. అమృత్ భారత్ కింద రూ. 53 కోట్లతో చేపడుతున్న నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను మంత్రికి వివరించారు. తాను చేసిన విజ్ఞప్తులకు మంత్రి సానుకూలంగా స్పందించి, తగు చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారని, ఇందుకు ధన్య వాదాలు తెలియజేస్తున్నానని ఎంపీ అర్వింద్ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ అర్వింద్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 20: మండలంలోని మల్లివానిపల్లె గ్రామంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మిర్జంపేట గ్రామానికి చెందిన మండ సురేష్ (35) జమ్మికుంట మండలంలోని కొత్తపల్లిలో ప్రైవేట్ కారు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం కొత్తపల్లి నుంచి బైక్‌పై తన బంధువుల ఇంటికి ఇల్లందకుంట మండలంలోని మల్లివానిపల్లె గ్రామం మీదుగా వెళ్తున్నాడు. గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. సురేష్ తల్లి వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత


గోశాలకు తరలించిన పశువులు

చిగురుమామిడి, సెప్టెంబరు 20: మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో శుక్రవారం అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్(టీజీ07 యూ 2943)ను పట్టుకున్నట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. కొండాపూర్ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యాన్‌లో ఐదు ఎద్దులు, మూడు ఆవులు, రెండు దూడలు ఉన్నాయి. వ్యాన్ డ్రైవర్ సాధిక్ ఖురేషిని విచారించగా పశువులను హుస్నాబాద్ సంతలో కొనుగోలు చేసి హైదారా బాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పాడని తెలిపారు. దీంతో అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌తో పాటు యజమాని సాజిద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. పశువులను గ్రామంలో ఉన్న గోశా లకు తరలించామని తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు


గాయపడ్డ కుమారస్వామి

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 20: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి కుమారస్వామి గురువారం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఛాతి, కడుపు, భుజం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మానసిక దివ్యాంగులకు తోడ్పాటునందించాలి


ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేస్తున్న నరహరి

తిమ్మాపూర్, సెప్టెంబరు 20: మానసిక దివ్యాంగులకు మనవంతుగా తోడ్పాటునందిస్తూ ఇతరులకు స్ఫూర్తి నివ్వాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ కమిషనర్ పరికిపండ్ల నరహరి అన్నారు. మండలంలోని మహాత్మానగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశా లను శుక్రవారం నరహరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటుగా ఇతర జిల్లాల్లో కూడా ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజమైనా సహాయార్థులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకొస్తున్న తమ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్‌కు ఆర్థికంగా సహాయ, సహకారం అందిస్తున్న వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి సహకా రంతో పాఠశాలకు సంబంధించిన సామగ్రి కోసం అవసరమైన 30వేల రూపాయల చెక్‌ను ప్రిన్సిపాల్ సతీష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో తిట్ల రమేశ్, మిట్టపెల్లి రాజేందర్, సుగుర్తి జగదీశ్వరాచారి, కళ్యాణ్ చంద్రశేఖర్, ఉమేశ్వర్, పి రామ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన ఒకరి రిమాండ్

వీణవంక, సెప్టెంబరు 20: ఓ బాలికను లైంగికంగా వేధించిన మైనర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. వీణవంక మండలానికి చెందిన బాలిక(11)ను వేధించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

నియామకం


మధుజాన్సన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 20: ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శిగా గుమ్మడి మధు జాన్సన్ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధు జాన్సన్‌ను 2023-2024 సంవత్సరానికి క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు జాన్సన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి సత్యవర్ధన్‌రావు, వి ఆంజనేయరావు, బి మదన్‌మోహన్‌రావు, ఎ నిర్మల, ఆల్ఫోర్స్ చైర్మన్ వి నరేందర్‌రెడ్డి, జిజెఎల్ అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, సెప్టెంబరు 20 : సైదాపూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న రసాయనశాస్త్రం అధ్యాపక పోస్ట్ (పీజీటీ- కెమిస్ట్రీ) నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి(హెచ్ బీటీ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారి సంపత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధింత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యూయేషన్, బీఈడీ చేసి టెట్ క్వాలిపై అయి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బోధన ఆధారంగా గరిష్ఠంగా 18,200 రూపాయల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు బండారి సంపత్‌కుమార్ 9014964242 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం


లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న డీన్ దాసరి శ్రీనివాస్

రామడుగు, సెప్టెంబరు 20: వ్యవసాయానికి అనుబంధంగా పెరటి కోళ్ల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలని కోరుట్ల వెటర్నిరి కాలేజ్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని షానగర్, శ్రీరాములపల్లి, రామడుగు గ్రామాల్లోని వందమందికి శుక్రవారం పీవీఎన్ఆర్ వెటర్నరి యూనివర్సిటీ కోరుట్ల వెటర్నరి కాలేజ్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ లబ్ధిదారులకు పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు. డీవీఏహెచ్‌వో కార్యాలయ ఏడీ డాక్టర్ వినోద్‌కుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాంబాబు ఉన్నారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

మానకొండూర్, సెప్టెంబరు 20: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న మానకొండూర్, శంకరపట్నం మండలాలకు చెందిన తెలుగు భాషోపాధ్యాయ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఉన్నందున తొమ్మిది గంటలకు హాజరు కావాలని ఆదేశాలు ఉన్నాయి. కాగా మండలంలోని మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయురాలు కే రాజేశ్వరీ, అన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కే శ్రీవాణి, పచ్చునూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు జి అంబిక, ఈదులగట్టిపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు కే యువరాజు 10.20గంటలకు హాజరయ్యారు. దీంతో వీరందరికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేసి రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

సిధారెడ్డికి 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారం

● తెలంగాణ భాషకు పట్టం కట్టిన సిధారెడ్డి ● పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్


నందిని సిధారెడ్డికి జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, తదితరులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 20 : ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డికి బుర్ర నరసమ్మ లింగారెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారాన్ని శుక్రవారం కరీంనగర్‌లో అందజేశారు. వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కార గ్రహీత సిధారెడ్డి మాట్లాడారు. బాధలు-గాయాలే కవిత్వాన్ని పండిస్తాయన్నారు. మట్టి వాసనలే సాహిత్య ఊటలకు ప్రేరణలని. అమ్మానాన్నల దీవెనలే మన అస్తిత్వమని అన్నారు. జీవితంలో అనుభవించే కన్నీళ్లే సాహితీవేత్తలకు సిరా చుక్కలని పేర్కొన్నారు. కష్టాల లోతుల్లోంచి జీవిత సత్యాలుకవిత్వ రూపంలో ఉబుకు తాయని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ సమాజహితం కోరే సాహితీవేత్తలు తమ రచనలతో ప్రజలను మేల్కొలుపుతూ నిస్వార్థంగా అక్షర సేద్యం చేస్తున్నారని అన్నారు. సిధారెడ్డి నిస్వార్థ నిరాడంబర నిక్కచ్చి జీవితం నేటి యువతకు దారి దీపంగా నిలుస్తుందని కొనియాడారు. తన అమ్మానాన్నల పేరిట జాతీయస్థాయి పురస్కారం అందిస్తున్న డాక్టర్ మధుసూదనరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాసు, విమర్శకుడు, రచయిత దాస్యం సేనాధిపతి, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ సంస్థ అధ్యక్షుడు, పురస్కార ప్రదాత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుల గణన తర్వాతనే వర్గీకరణ జరగాలి


అభివాదం చేస్తున్న బేడబుడిగ జంగాల హక్కుల పోరాట సమితి నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20 : కుల గణన చేసిన తరువాతనే వర్గీకరణ జరగాలని తెలంగాణ బెడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సిరపాటి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్రస్థాయి సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిరపాటి వేణు మాట్లాడారు. మాల మాది గలతో కలపకుండా బెడ బుడగ జంగాల ఉప కులాలను ఏ జాబితాలో చేర్చాలని, తమకు ఐదుశాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొందన్నారు. దానిని అమలు చేయాలని, చైర్మెన్‌గా బెడ బుడగ జంగాలనే నియమించాలని, పదివేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అభయహస్తం పేరుతో రూ. 12లక్షలు ఇస్తామని ప్రకటించిందని, దానిని వెంటనే అమలు చేసి, 40శాతం బెడ బుడగ జంగాలకు కేటాయించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తరువాత జనాభా దామాష ప్రకారం బేడ బుడగ జంగాలకు రాబోయే రోజుల్లో రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయిం చాల న్నారు. బెడబుడగ జంగాలకు చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బెడబుడగ జంగాలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి నెలకు రూ. 12వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావే శంలో గౌరవాధ్యక్షుడు తురుపాటి లింగ య్య, ప్రధాన కార్యదర్శి పస్తం ఆంజనేయులు, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు పాశర్లపూడి లక్ష్మి, పస్తం పరశురాములు, డొక్క రాజేశ్, పత్తి బాషశివ, మొటం నాగార్జున, మొటం రాములు తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు..

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

గన్నేరువరం, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలో అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మంగళారపు రాయమల్లు(55)కు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివా హం చేశాడు. రాయమల్లుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అదే గ్రామానికి చెందిన పుల్లెల తిరు పతి వద్ద గతంలో లక్షా యాభైవేల రూపాయలను అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలని రాయ మల్లుపై తిరుపతి పలుమార్లు ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో పుల్లెల తిరుపతి ఖాళీ బాండ్ పేపర్‌పైన రాయమల్లు సంతకం తీసుకున్నాడు. ఆ తరువాత ఖాళీ బాండ్ పేపర్‌లో రాయమల్లుకు చెందిన వ్యవసాయ భూమిని అమ్మినట్లుగా ఇందుకు ఐదు లక్షలు ముట్టినట్లుగా మరో లక్ష ఇస్తే భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని బాండ్ పేపర్‌లో రాసుకున్నారు. రాయమల్లు తీసుకున్న లక్షా యాభైవేల అప్పును కొద్ది నెలల క్రితమే పుల్లెల తిరుపతికి చెల్లించాడు. అప్పు చెల్లించినా పుల్లెల తిరుపతి, అతడి బంధువులు పుల్లెల ఆంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ అనే రాయమల్లును భూమి రిజిస్ట్రేషన్ చేయమని వేధింపు లకు గురి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రాయమల్లు గురువారం రాత్రి తన ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఖాళీ బాండ్ పేపర్‌పై సంతకం చేయించు కొని మోసం చేయడమే కాకుండా భూమి పట్టా చేయాలని పుల్లెల తిరుపతి, పుల్లెల ఆంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ వేధించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు రాయమల్లు భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద



జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 8,895 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 8,895 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

- అడ్డుకున్న హోంగార్డు

జమ్మికుంట, సెప్టెంబర్ 20: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఓ మహిళ పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డు అడ్డుకోవడంతో ప్రాణపాయం తప్పింది. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అత్తింటి వారు వేధిస్తున్నారనే నెపంతో ఇటీవల మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. తల్లి సైతం మందలించడంతో పురుగుల మందు డబ్బాతో జమ్మికుంట బస్టాండ్‌కు చేరుకుంది. ప్రయాణికులు చూస్తుండగానే పురుగుల మందు డబ్బా మూత తీసి తాగేందుకు ప్రయత్నించింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు ఆమె వద్ద పురుగుల మందు డబ్బా లాక్కోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది మహిళను స్టేషన్‌కు తీసుకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం మహిళ తల్లిని పిలిపించి అప్పగించారు.

భవనం పైనుంచి దూకిన కేజీబీవీ విద్యార్థిని

తీవ్ర గాయాలు

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20: పాఠశాలలో ఉండలేనని రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పర్లపల్లి అశ్విత శుక్రవారం రాత్రి పాఠశాల భవనం పైనుంచి దూకింది. ఈ సంఘటనలో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. బాలికను పాఠశాల సిబ్బంది హుటాహుటిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్నపల్లి మండలం జంజేరు గ్రామానికి చెందిన అశ్విత మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆరో తరగతి నుంచి చదువుతోంది. కొంత కాలంగా తాను పాఠశాలలో ఉండనంటూ తల్లిదండ్రులకు చెబుతోంది. ఈ క్రమంలో శుక్రవారం తరగతులు ముగిసిన అనంతరం భవనం మొదటి అంతస్తు పైకి వెళ్లి కిందకు దూకింది. నడుముకు బలమైన గాయాలవడంతో ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థినులు ఏం చేస్తున్నారో గమనించకపోతే ఎలా అంటూ పాఠశాల ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్‌ఐ రమాకాంత్, ఎల్లాగౌడ్ వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.


చికిత్స పొందుతున్న అశ్విత

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం

టీషర్ట్స్ బుక్ చేస్తే ఖాళీ బాక్స్


ఆన్‌లైన్‌లో వచ్చిన అట్టను చూపుతున్న బాధితుడు రహ్మాన్‌ఖాన్

ఇల్లందకుంట, సెప్టెంబరు 20 : అమెజాన్ ఆన్‌లైన్ షాపింగ్‌లో రూ. 548 విలువ చేసే టీషర్ట్స్ బుక్ చేస్తే వట్టకి స్టిక్కర్ బొమ్మ వేసి డెలివరీ చేసిన సంఘటన ఇల్ల ందకుంట మండలం సిరిసేడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు రహ్మాన్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం. రూ. 548 విలువ చేసే టీషర్ట్స్ బుక్ చేయగా వాటికి బదులుగా ఖాళీ వట్టకి స్టిక్కర్లు వేసి డెలివరీ చేశారు. తను చేసిన టీషర్ట్స్ ఇంత చిన్న పరిమాణంలో ఉంటాయాన్న అనుమానంతో ప్యాకెట్ విప్పలేదు. దీనిపై అమెజాన్ యాప్‌లో ఐటమ్ రిటర్న్ పెట్టాడు. కొరియర్ బాయ్ రావడంతో అతని ముందే ప్యాకింగ్ ఓపెన్ చేశాడు. అందులో స్టిక్కర్ బొమ్మ వచ్చిందని బాధితుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారుల ఫోరంలో కేసు వేయనున్నట్లు తెలిపాడు.

టీబీ నివారణపై అవగాహన


నసుగులను సందర్శించిన టీబి అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్

చందుర్తి, సెప్టెంబర్ 20: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మల్యాల, ననుగుల సబ్ సెంటర్‌లో టీబీ నివారణపై శుక్రవారం ఆరోగ్య సిబ్బందికి టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ఇంపాక్ట్ ప్రోగ్రామ్ జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అధిక సంఖ్యలో కేసులు మన ఇండియాలోనే నమోదు అవుతున్నాయన్నారు. దీని ద్వారా మరణాల సంఖ్య అధికంగా ఉందన్నారు. టీబీ అనే మహమ్మారిని ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఐదు జిల్లాలను ఎంపిక చేసిందని అందులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకటని అన్నారు. టీబీ బారిన పడి ఆ వ్యాధిని జయించిన వారిని టీబీ చాంపియన్‌గా గుర్తించి వారికి శిక్షణ నిర్వహించి, వారి ద్వారా వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ శశికల, ఎంఎల్ హెచ్‌పిలు డాక్టర్ ఐశ్వర్య, నవీన్, సూపర్వైజర్ గంగాధర్, ఏఎన్ఎంలు రమాదేవి, పద్మ, మమత, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కరీంనగర్ హాఫ్ మారథాన్

3కె, 5కె,10కె,21కె విభాగాల్లో నిర్వహణ


కరీంనగర్ హాఫ్ మారథాన్ టీ షర్ట్‌లను ఓపెన్‌చేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 20: కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్ట్‌ల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న కరీంనగర్‌లో రెండవ ఎడిషన్ కరీంనగర్ హాఫ్ మారథాన్ నిర్వహించనున్నట్లు మారథాన్ కమిటీ అధ్యక్షుడు పసుల మహేశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మారథాన్ వివరాలను వెల్లడించారు.

రన్ ఫర్ హెల్త్, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతోపాటు కరీంనగర్ ప్రజలకు ఫిట్‌నెస్‌పై అవగాహన ఆరోగ్యం లక్ష్యంగా హాఫ్ మారథాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మారథాన్‌లో మూడు కిలో మీటర్లు, 5,10, 21 కిలో మీటర్ల విభాగాల్లో నాలుగు కేటగిరీలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా యంత్రాంగం పోలీసు కమిషనరేట్, టూరిజంల ఆధ్వర్యంలో నిర్వహిసున్న ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు ఇప్పటి వరకు 5వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిని మాత్రమే మారథాన్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తామని చెప్పారు. అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమై భగత్‌నగర్, కలెక్టరేట్, ప్రతిమ మల్టీ ఫ్లెక్స్ తెలంగాణచౌక్, పద్మనగర్ మీదుగా ఎల్ఎండీ నుంచి తిరిగి అంబేద్కర్ స్టేడియం వరకు సాగుతుందని తెలిపారు. ఈ మారథాన్‌లో పాల్గొనే వారందరికి టీషర్ట్స్‌ను అందజేస్తామని మహేశ్ తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, పురుషులు, మహిళలు పాల్గొనే ఈ మారథాన్‌లో 21కె విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 10వేలు, సెకండ్ ప్రైజ్ 7వేల 500, థర్డ్ ప్రైజ్‌గా 5వేలు, 10కె విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 7వేలు, సెకండ్ ప్రైజ్ 5వేలు, థర్డ్ ప్రైజ్‌గా 3వేలతో పాటు మెమోంటోలు అందజేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం టీషర్ట్స్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా క్రీడాధికారి శ్రీనివాస్‌గౌడ్, మార్కెటింగ్ డిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

సుభాష్‌నగర్ ; సెప్టెంబరు 20: ఎస్సీ, ఎస్టీ, వర్గీకరణ, క్రిమిలేయర్ అమలుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజనపార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం, కాంగ్రెస్, మనువాద పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టులో వందకుపైగా రివ్యూ పిటిషన్‌లు పెండింగ్‌లో ఉండగా రేవంత్ సర్కార్ వర్గీకరణకు కమిటీ వేయడం సిగ్గుచేటన్నారు. కమిటీని వెంటనే రద్దుచేయాలన్నారు. సెప్టెంబరు 30న ఛలో హైదరాబాద్ సచివాలయం ముట్టడికి తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పసుల రాజలింగం, ఆర్ల రమేష్, యనమల మంజుల, బద్దం డేనియల్, రాగి రాజేష్, తీగల శేఖర్, శ్రీని వాస్, నిచ్చికోల రాంచందర్, లింగాల జలపతి, చిప్పరి కరుణాకర్, పిట్ల ఈశ్వర్, దుగుట రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడియేట్ విద్యార్థి మృతి చెందాడు. హనుమకొండ జిల్లా మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్(18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని సిగ్మా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్‌చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ధర్మపురి, సెప్టెంబరు 20: ధర్మపురి మండలంలోని రాయపట్నం సమీపంలో రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించగా శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ గంగుల మహేష్ తెలిపారు. సదరు వ్యక్తి 20 రోజుల నుంచి మతి స్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతుండేవాడు. 10 రోజుల క్రితం గ్రామ శివారులో రోడ్డు పక్కన పడి ఉండగా 108లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సదరు వ్యక్తి మాట్లాడలేని స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియలేదు. జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రాయపట్నం గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యుల వివరాలు తెలిస్తే పోలీసులకు తగు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

జ్వరంతో ఆరేళ్ల బాలుడి..

రాయికల్, సెప్టెంబరు 20 : రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రాస మనీష్ (6) అనే ఆరేళ్ల బాలుడు జ్వరంతో శుక్రవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజశేఖర్-లాస్య దంపతులకు ఇద్దరు కవల పిల్లలు. నాలుగు రోజుల నుంచి ఇద్దరికీ జ్వరం రావడంతో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం పెద్ద కుమారుడు మనీష్‌కు తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల నుంచి కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

బావిలోపడి రైతు..

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 : కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌కు చెందిన బోనగిరి సత్తయ్య(51) ప్రమాదవశాత్తుగా వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్యకు పిట్స్ వ్యాధి ఉండగా మందులు వాడుతున్నాడు. గురువారం తన వ్యవసాయబావి వద్దకు సత్తయ్య, అతడి భార్య వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు అతని భార్య ఇంటికి వెళ్లగా సత్తయ్య బావి వద్ద విద్యుత్ మోటార్ బంద్ చేసేందుకు వేచి ఉన్నాడు. ఈ సమయంలోనే మూర్చవచ్చి ప్రమాదవశాత్తు జారి బావిలోపడి మృతిచెంది ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం సాయంత్రం సత్తయ్య ఇంటికి రాకపోవటంతో బావి వద్ద వెతకగా అతని చెప్పులు కనిపించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. శుక్రవారం ఉదయం బావిలోని నీటిని మోటార్ ద్వారా తోడగా బావిలో సత్తయ్య మృతదేహం కనపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట సెప్టెంబరు 20 : కోనరావుపేట మండలం మర్తన్‌పేట గ్రామానికి చెందిన కప్పు భాను (50)అనే వడ్రంగి అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మర్తన్‌పేటకు చెందిన భాను సుమారు రూ.5 లక్షల వరకు వెచ్చించి కట్టె కోత మిషన్ కొనుగోలు చేశాడు. కట్టెపని దొరకకపోవడం, మిషన్‌కోసం చేసిన అప్పుల మిత్తి పెరగడంతో మనోవేదన గురయ్యా డు. ఈ క్రమంలోనే అప్పులు ఎలా తీర్చాలో తెలియక గురువారం రాత్రి దూలానికి ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య బాలవ్వ, కుమారులు వెంకటేష్, భూమేష్ ఉన్నారు.

కారును ఢీకొన్న లారీ

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20 : జిల్లా కేంద్రం లోని కూనారం క్రాస్ రోడ్డు వద్ద కారును లారీ ఢీకొనడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి ట్రాఫిక్ పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సిద్దిపేట సీఐ లక్ష్మిబాబు సస్పెన్షన్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 : గతంలో కరీంనగర్‌లో సీఐగా పనిచేసిన సమయంలో ఒక కేసుకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ అనంతరం ప్రస్తుత సిద్దిపేట సీఐ లక్ష్మిబాబును సస్పెండ్ చేస్తూ శుక్రవారం నార్త్‌జోన్ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడాది కిందట కరీంనగర్‌లోని పలు ఫైనాన్స్‌లపై పోలీసులు దాడులు నిర్వహించి నగదు, రికార్డులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఈ సమయంలో కరీంనగర్‌లోని ఒక ఫైనాన్స్‌లో పోలీసుల దాడుల్లో లభ్యమైన డబ్బుల్లో 10 లక్షల నగదు తేడా రావటంతో ఈ వ్యవహారంపై సంబంధితులు ఐజీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఐజీ ఆదేశాలతో కరీంనగర్ పోలీస్‌కమిషనర్ విచారణ నిర్వహించి, నివేదిక అందజేయగా ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారని తెలిసింది.

గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో గురువారం ఒకరు గల్లంతుకాగా శుక్రవారం ఆచూకి లభ్యమైంది. ఆదిలాబాద్ జిల్లా ఊట్నూరుకు చెందిన సంపంగి శ్రీనివాస్(24) కొన్ని రోజులుగా జగిత్యాలలో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం చింతకుంట చెరువులోకి ఈత కోసం వెళ్లి బయటకు రాకపోవడం స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. శుక్రవారం పోలీసులు జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం లభ్యం కాగా కేసు నమోదు చేశామన్నారు.

కోరుట్లను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిదాం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు

కోరుట్ల, సెప్టెంబరు 20 : స్వచ్ఛ పట్టణంగా కోరుట్ల పట్టణాన్ని తీర్చిదిద్దుదామని మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలతో పాటు గడి ప్రైమరీ బడిలో విద్యార్థులకు స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమం నిర్వహించి పారిశుధ్యం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులచేత ప్లాస్టిక్ నివారణ, పారిశుధ్యంపై అవగాహన, ర్యాలీని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు మొక్కలు నాటారు. మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ప్రతిజ్ఞను చేశారు. తడిపొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, నునావత్ రాజు, సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ గోనెల మహేష్, ఉపాధ్యాయులు సురేందర్, ఫాతిమ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల సందర్శన

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 20 : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో గల ఆయిల్‌పామ్ తోటలను జిల్లా వ్యవసాయాధికారిణి వాణి, జిల్లా ఉద్యానవనఅధికారి దేవాప్రసాద్‌లు శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు భారీఎత్తున సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సాకాలను అందిస్తుందని, ఆయిల్ పామ్‌సాగురైతులకు లాభదాయకమని, ఆసక్తి గల రైతులు ఆయిల్‌పామ్ పంటవైపుకు రావాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏవో తిరుపతినాయక్, ఏఈవోలు స్వాతి, రమ్య, ఉద్యానవనఅధికారి అన్వేష్ పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకే పోషణమాసం

● జిల్లా సంక్షేమ అధికారి భోనగిరి నరేష్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 20: గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలలో రక్తహీనతను నివారించేందుకే పోషణమాసం కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భోనగిరి నరేష్ అన్నారు. పట్టణంలోని గొల్లపల్లి రోడ్‌లో గల ప్రభుత్వ సోషల్ రెసిడెన్షియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ఆరోగ్యశాఖ సిబ్బందిచే రక్తపరీక్షలు నిర్వహించి, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీడబ్ల్యూవో నరేష్ మాట్లాడుతూ రక్తహీనతను నివారించడంతోపాటు, పిల్లల్ల పోషణస్థాయిని పెంపొందించేందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. రక్తహీనత నివారణ కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కిషోర బాలికలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భవిష్యత్తులో ఆరోగ్యకరంగా ఉండాలంటే ఏ విధమైన పోషకాహారం తీసుకోవాలనే విషయాలను వారికి క్షేత్రస్థాయిలో వివరిస్తున్నామన్నారు. అనంతరం పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో మమత, మెడికల్ ఆఫీసర్లు స్వాతి, సౌమ్య, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధుకుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, పోషణ అభియాన్, మహిళా శక్తి కేంద్రాల సిబ్బంది, బాలల పరిరక్షణ అధికారి, ఏఎన్ఎం, ఆశా, హెల్త్‌సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



గర్భిణిలకు సీమంతం చేస్తున్న సీడీపీవో

పౌష్టికాహారం తీసుకోవాలి: సీడీపీవో వీరలక్ష్మి

కొడిమ్యాల : పౌష్టిక ఆహార పదార్థాలను తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పూడూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో సీడీపీవో మాట్లాడుతూ తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆకు కూరలను, చిరుధాన్యాలను, విటమినల్లను కలిగిన ఆహార పదార్థాలను సమపాల్లలో తీసుకోవాలన్నారు. తల్లుల, పిల్లల సంరక్షణకు ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపడుతోం దన్నారు. వయస్సుకు తగిన బరువు, ఎత్తుకు తగిన బరువు, ఉండే విధంగా తల్లులు శ్రద్ధ చూపాలని కోరారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్ర మంలో మెడి కల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, హెల్త్ సూపర్ వైజర్ అలివేలు, సూపర్‌వైజర్లు సుధారాణి, ఉమ, శారద, జ్యోతి, సుభద్ర, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గర్భిణిలు పాల్గొన్నారు.

మల్యాల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణమాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముత్యంపేటలోని ప్రాథమిక పాఠశాలలో కిషోర బాలికలకు పోషణ, ఆరోగ్య విద్య, రక్తహీనత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలు గంగ, శోభరాణి, శారధ, మమత, ఆశావర్కర్ లత పాఠశాల పాల్గొన్నారు

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో శుక్రవారం పోషక ఆహార మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మెట్‌పల్లి అర్బన్ అంగన్‌వాడీ సెంటర్‌ల ఆధ్వర్యంలో పోషణ మాసంలో భాగంగా కాలేజ్ విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ మాట్లాడుతూ కిషోర్ బాలికల రక్తహీనత, పోషకహారం గురించి, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగహన కల్పించారు. పోషకహారం అంటే సమతుల ఆహారం తీసుకోవడమేనని తెలిపారు. ఇంద్రధనస్సు రంగు కల్గిన అన్ని రకాల ఆహారాలను తీసుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాదస్తు పద్మ, నజీమా, సుమలత, వనజ, గంగాలక్ష్మీ పాల్గొన్నారు.



రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కథలాపూర్ : కిశోర బాలికలకు పోషక విలువలు ఉన్న అహారం అందిస్తేనే ఐరన్ లోపం, రక్తహీనత వంటి సమస్యలు పరిష్కారమవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైమదీబేగం అన్నారు. శుక్రవారం మండలంలోని తాండ్ర్యాల, భూషణరావుపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనత సమస్యల నివారణపై సెమినార్ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఖర్జూరం, మునగాకు, బెల్లం పల్లీలు కలిపి తింటే ఆరోగ్యకరంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు వనిత, రమ, స్వరూపారాణి, వరలక్ష్మీ, శారద, రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో పోషణ అభియాన్ ప్రతిజ్ఞ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోషణ అభియాన్‌లో భాగంగా విద్యార్థులతో పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. పోషకాహారం, చిరుధాన్యాలు, ఆకుకూరలు, పాలు, పండ్లు, మిల్లెట్స్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్ఎంలు భాగ్య లక్ష్మి, రజిత, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, బుజ్జమ్మ, సుజాత, అనురాధ, ఆశ కార్యకర్తలు రమాదేవి, సుమలత, అనురాధ, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులను ఆదుకోవాలి

మెట్‌పల్లి, సెప్టెంబరు 20(ఇబ్రహీంపట్నం): కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి లత మాట్లాడుతూ బీడీ కార్మికులకు డబుల్ బెడ్ రూంలు ఇవ్వాలని అదే విధంగా పదవీ విరమణ పొందిన కార్మికులకు 7 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు పీఎఫ్ కటాఫ్ డేట్ లేకుండా పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం 4 వేల పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ధర్మపురి పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా



ధర్మపురిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ధర్మపురి, సెప్టెంబరు 20: ధర్మపురి పట్టణంలోని చింతామణి చెరువు వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం చెరువు వద్ద పెరిగిన గడ్డిని తొలగించారు. స్వచ్ఛతా హీ సేవా-స్వచ్ఛతా శ్రమదానం, ప్లెడ్జి నిర్వహించారు. చెరువు పరిసరాలను పరిశుభ్రం చేయించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఇన్‌చార్జి కమిషనర్ బాలె గంగాధర్, కౌన్సిలర్లు బండారి అశోక్, సయ్యద్ యూనస్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్, పర్యావరణ ఇంజనీరు మహేష్, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు వెంకటేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 20: ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేస్తే జరిమానాలు విధిస్తామని అధికారులు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆత్మనగర్‌తో పాటు పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు తడి పొడి చెత్త, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యదర్శి నిజామొద్దిన్ తన సిబ్బందితో గ్రామంలోని ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్తను వేరువేరుగా బుట్టలో వేసి పంచాయతీ కార్మికులకు అందజేయాలని, ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల తెలిపారు. మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది, నాయకులు, పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



ఆత్మనగర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోరుట్ల, సెప్టెంబరు 20 : పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్ పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించగా విశేస స్పందన లభించింది. శిబిరాన్ని లయన్స్ క్లబ్ 320 జీ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ప్రారంభించారు. రేకుర్తి వైద్యులు సుమార్ 100 మందికి నేత్ర వైద్యం నిర్వహించి 45 మందికి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నట్లు తెలిపి ప్రత్యేక వాహనం ద్వార రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మహిళ సభ్యులు పోతని శ్రీలత-ప్రవీణ కుమార్, పోలాస గీతారాణి, మంచాల రోజారమణి-జగన్, అడెపు కమల-మదు, పోల హిమబిందులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రతీ పౌరుడు విధిగా మొక్కలను నాటాలి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్

కొడిమ్యాల, సెప్టెంబరు 20 : దేశంలోని ప్రతీ పౌరుడు విధిగా మొక్కలను నాటాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో బాగంగా శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకె నామ్ అన్న నినాదంతో మండలంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా మేనెజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించే బాధ్యతను పూర్తి స్థాయిలో తీసుకోవాలన్నారు. అప్పుడు లక్ష్యం నెరవేరుతుందన్నారు. అంతక ముందు గ్రామ పంచాయతీ వద్ద స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమేష్, ఎంపీవో వాసవి, టీజీబీ కొడిమ్యాల శాఖ మేనెజర్ సురేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి. లావణ్య, సీనియర్ మేనెజర్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎఫ్ఐ దివ్యవాణి, ఎఫ్ఎల్సీ మదుసూధన్, గ్రామ ప్రముఖులు బైరి వెంకటి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు శిశుమందిర్ విద్యాసంస్థలు

మెట్‌పల్లి ఆర్‌డీవో నక్క శ్రీనివాస్

కోరుట్ల, సెప్టెంబరు 20 : క్రమశిక్షణకు మారుపేరుగా శిశుమందిర్ విద్యా సంస్థలు నిలుస్తాయని మెట్‌పల్లి ఆర్డీవో, కోరుట్ల ఇన్‌చార్జి నక్క శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శిశుమందిరంలో సిద్దిపేట, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల విభాగ్ స్థాయి గణిత, విజ్ఞాన మేళా డాక్టర్ రవి కిరణ్ అధ్యక్షతన జరుగగా మెట్‌పల్లి ఆర్‌డీవో, కోరుట్ల ఇన్‌చార్జి నక్క శీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన గణిత విజ్ఞాన మేళాను వక్తలు పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ అంశాల గురించి వక్తలు అడిగి తెలుసుకుని అభినందించారు. ఆర్‌డీవో మాట్లాడారు. విద్యార్థులలో చైతన్యం నింపడానికి విజ్ఞాన మేళాలు దోహదపడుతాయన్నారు. విజ్ఞాన మేళా ద్వార పోటీ తత్వం పెంచుతూ ఉన్నత ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్ర మం లో వార్డు కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తస్నీర్ శ్రీనివాస్ రావు, మండల విద్యాధికారి నరేశం, ప్రభుత్వ జిల్లా సైన్స్ ఉద్యోగి బాజోజీ శ్రీనివాస్, శిశుమందిర్ విభాగ్ సైక్షనిక్ ప్రముఖ్ కాటం రవీందర్, పాఠశాల కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, కరస్పాడెంట్ నీలి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు గోపు వెంకటేష్, కమిటీ సభ్యులు అందె శివప్రసాద్, ఎలిమిల్ల మనోజ్‌కుమార్, కొండబత్తిని అమర్‌నాథ్, కొత్త సందీప్, సమితి కార్యదర్శి చెట్ పల్లి శంకర్ అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



ముగింపు సమావేశంలో పాల్గొన్న వక్తలు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు స్వీకరిం చిన ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌ను జగిత్యాల ఎమ్మె ల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్‌లు శుక్రవారం కలిశారు. జగిత్యాల నియోజకవర్గ కాంగ్రెస్ వ్యవహారాలకు సంబందించి పలు అంశాలను చర్చిం చారు. నిజామాబాద్‌కు చెందిన ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు.

నామినేటెడ్ పదవుల భర్తీలో కార్యకర్తలకు ప్రాధాన్యతనివ్వాలి

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల భర్తీలో కార్యకర్తలు, క్యాడర్ కు ప్రాధాన్యతనివ్వాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌కు జగిత్యా లకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది గుంటి జగదీశ్వర్ వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం హైద్రాబాద్‌లో మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ప్రభుత్వం చేపట్టబోయే నామినేటెడ్ పదవుల భర్తీ సందర్భంగా ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన కార్యకర్తలకు, క్యాడర్‌కు ప్రాధాన్యతనిచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మహేశ్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించినట్లు జగదీశ్వర్ తెలిపారు.

రాఘవుపేటలో వైద్య శిబిరం

మల్లాపూర్, సెప్టెంబరు, 20 : మండలంలోని రాఘవపేట గ్రామంలోని వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని 57 మందికి డాక్టర్ వాహిని వైద్య పరీక్షలు చేశారు. జ్వరం వచ్చిన 9 మందిని గుర్తించి వారి రక్తం సేకరించి పరీక్షల నిమత్తం ల్యాబ్‌కు పంపించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రామోహన్, ఎమ్ఎల్‌హెచ్‌పీ విక్రమం, ఏఎన్ఎమ్ విజయ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరగాల్సిన అవసరముందని కలెక్టర్ సత్యప్రసాద్ సంబందిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సీజనల్ వ్యాదులు, హెల్త్ ఇండికేటర్స్ అంశాలపై వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టెలిమానస్ 14416 ఫోమ్ బోర్డు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో బీపీ, మధుమేహం, కార్సినోమా తదితర వ్యాదుల శాతాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీలు లక్ష్యం మేరకు జరగడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో మాతా శిశు సంరక్షణ కేంద్రం అందుబాటులో ఉండడం, అందులో నిపుణులైన వైద్యులున్నారన్నారు. గర్భవతులను నమోదు చేసినప్పుడే నార్మల్ డెలివరీ, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవంపై ప్రోత్సహించాలన్నారు.

ప్రజలు ఎవరైన మానసిక సమస్యలతో బాధపడితే 14416 అనే టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి తమ సమస్యలను విన్నవిస్తే తిగిన సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమీయోద్దిన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్ శ్రీనివాస్, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ అర్చన, ఎంహెచ్ఎన్ ప్రోగ్రా అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి, జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, సెప్టెంబరు 20 : కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పంపిణీ చేశారు. 38 మంది లబిదారులకు వారి వారి ఇండ్లకు ఎమ్మెల్యే డా క్టర్ సంజయ్ స్థానిక నాయకులతో కలిసి వారి వారి ఇండ్లకు వెళ్లి చెక్కులను అందించారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ నిరుపేదల కోసం కళ్యాణ లక్ష్మి, షాది ముబారకు పథకంను ప్రవేశపెట్టి అందించాడన్నారు. సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు దారి శెట్టి రాజేష్ నాయకులు రహీం పాషా, గంగధర్, నగేష్, అన్వర్, ప్రభులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధుర్, తిమ్మాపూర్, యామపూర్, ఫకీర్‌కొండపూర్, వేములకుర్తి, బర్తీపూర్, మూలరాంపూర్, ఎర్దండి, ఇబ్రహీంపట్నం, వర్షకొండ, కోమటికొండపూర్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన 62 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ శుక్రవారం కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. 62 మంది లబ్దిదారులకు 62,07,192 లక్షల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎలాలా దశరత్‌రెడ్డి, నాయకులు నేమూరి సత్యనారయణ, జాజాల జగన్‌రావు, నోముల లక్మరెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

'జూనియర్ లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలి'

గొల్లపల్లి, సెప్టెంబరు 20: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టులను ప్రమోషన్ల ద్వారా వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా అధ్యక్షుడు భోనగిరి దేవయ్య ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గొల్లపల్లి మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సభ్యత్వం కల్పించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్లు, మండల విద్యాధికారులు, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పోస్టులను ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి భర్తీ చేయాలని పేర్కొన్నారు. జిల్లా బాధ్యులు పూర్ణచందర్, గంగారెడ్డి, మండల అధ్యక్షుడు మొగిలి రవి కుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

బోధన కోసం దరఖాస్తులు ఆహ్వానం

ధర్మపురి: మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన బోధించుటకు అర్హత కలిగి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ సైన్స్ 1, టీజీటీ సోషల్ 1, పీజీటీ ఇంగ్లీష్ 2, పీజీటీ ఫిజిక్స్ 1, పీజీటీ కెమిస్ట్రీ 1, పీజీటీ కామర్స్ 1, పీజీటీ సివిక్స్ 1, పీజీటీ బాటనీ 1, పీజీటీ జువాలాజీ 1 ఖాళీలు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. టీజీటీ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో బీఈడీ, టెట్ పాసై ఉండాలని, పీజీటీ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, బీఈడీ పాసై ఉండాలని వివరించారు. ఈ నెల 23 వరకు అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఈ నెల 25న ఇంటర్‌వ్యూ నిర్వహణ ఉంటుందన్నారు. అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాల నందు గంటల ప్రాతిపదికన బోధించుటకు లెక్చరర్ పోస్టుల భర్తీకి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటి కెమిస్ట్రీ పోస్టుకు గాను ఎంఎస్సీ కెమిస్ట్రీ బి.ఎడ్ కలిగి ఉండాలని, పీజీటీ ఇంగ్లీష్ పోస్టుకు గాను ఎం.ఏ ఇంగ్లీష్ బి.ఎడ్ అర్హత కలిగి ఉన్న వారు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత గల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్స్‌తో ఈ నెల 23, 24 తేదీలలో సోమవారం లేదా మంగళవారం నాడు డెమోలకి హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ తెలిపారు. టీజీటీ ఇంగ్లీష్, పీజీటీ ఇంగ్లీష్, పీజీటీ బాటనీ, పీజీటీ ఫిజిక్స్, పీజీటీ కెమిస్ట్రీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. టీజీటీకి ఏదైనా డిగ్రీ, బీఈడీ, టెట్, పీజీటీకి పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని, డెమో 25న ఉంటుందని పేర్కొన్నారు.

డిగ్రీ లెక్చరర్ కృష్ణ ప్రసాద్‌కు డాక్టరేట్

మెట్‌పల్లి, సెప్టెంబరు 20 (ఇబ్రహీంపట్నం) : మెట్‌పల్లి పట్టణానికి చెందిన కృష్ణప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ పొందాడు. కృష్ణప్రసాద్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో ఫిజికల్ స్పెక్ట్రాస్కోపిక్ స్టడీస్ ఆన్ ఆల్కలైన్ ఎర్త్‌ఆక్సైడ్ కంటైనింగ్ మిక్స్ అల్కలి టెట్రా బోరేట్ గ్లాసెస్ అనే అంశంపై పరిశోధన ను జి. రామదేవుడు పర్యవేక్షణలో చేశారు. అందుకుగా ను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కృష్ణప్రసాద్‌ను రాష్ట్రీయ ఉపాధ్యాయ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అల్లకట్టు సత్యనారాయణ అభినందించారు.

రాజారాంపల్లి వాసికి డాక్టరేట్

ఎండపల్లి: మండలంలోని రాజారాంపల్లి గ్రామానికి చెందిన బండ నరేష్‌కుమార్‌కు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందింది. రోల్ ఆఫ్ రీజనల్ రూరల్ బ్యాంక్స్ ఇన్ ఫైనాన్షియల్ ఇంక్లూసిన్ ఏ స్టడీ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అనే అంశంపై డాక్టర్ శ్రీనివాస్ కామర్స్ విభాగం ఉస్మానియా విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ పొందారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

మల్యాల, సెప్టెంబరు 20: జిల్లా స్థాయి పాఠశాలల పోటీలకు మల్యాల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన మండల స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచడంతో ఈ నెల 25 నుంచి జరుగనున్న అండర్-17, అండర్-14 పోటీలలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయురాలు అనుపమ తెలిపారు.

గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 24న జరిగే వాలీబాల్ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అజయ్ బాబు తెలిపారు. సెప్టెంబరు 11, 12 తేదీల్లో లక్ష్మీపూర్‌లో నిర్వహించిన పోటీల్లో అత్యంత ప్రతిభకనబరిచి, 18 మంది ఎంపికైనట్లు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కథలాపూర్, సెప్టెంబరు 20 : మండలంలోని గంభీర్‌పూర్‌లో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు రైతాంగం నష్టపోయిన అంశం గురించి ఈ నెల 19న ఆంధ్రజ్యోతిలో ప్రచరితమైన 'వరదలతో పంటలు నష్టపోయిన రైతులు' అనే కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. శుక్రవారం ఏఈవో సుష్మశ్రీ వాగు పక్కన కోతకు గురైన వరి పంటలను పరిశీలిం చారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

మెట్‌పల్లి, సెప్టెంబరు20(ఇబ్రహీంపట్నం) : పట్టణంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాలను శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వేంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు శాతం తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని కాలేజీలలో ఈ విద్యా సంవత్సరం నుంచి జేఈఈ నిట్, టీజీఈఏపీ సెట్ పరీక్ష లకు శిక్షణకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని అందుకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్న సిబ్బందిని అభినందించారు. ప్రిన్సిపాల్ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్ మేళాలో పాల్గొన్న విద్యార్థిని

రాయికల్, సెప్టెంబరు 20: జిల్లా కేంద్రంలోని డీసీఈబీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన హెచ్ఐవీ ఎయిడ్స్ పోస్టర్ మేళా కార్యక్రమంలో రాయికల్ లోని ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని రషిక పాల్గొంది. రషిక హెచ్ఐవీ ఎయిడ్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను రూపొందించి ప్రశంసా పత్రాన్ని అందుకుంది. విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ జయశ్రీ అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 20 : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్న గం టల పద్మతో పాటు తన తోటి స్వీపర్లను కులంపేరుతో దూషించిన జగిత్యాలకు చెందిన ఆర్ ఆర్ న్యూస్ రిపో ర్టర్ కృష్ణ అనే వ్యక్తిపై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమో దుచేసినట్లు రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. తిమ్మా పూర్ శివారులో గల చిన్నగట్టుదేవాలయం వద్ద గంటల పద్మ తన తోటిసిబ్బందితో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న అనంతరం అక్కడే బోజనాలు చేశారు. గమనించిన కృష్ణ అనే అక్కడికి చేరుకొని వీరిని కులంపేరుతో దూషించి అంతు చూస్తానని బెదిరించాడు. బాధితురాలు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్త చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.